# వెల్లువ

ఎండ ఉదయాన్నే చిటచిట లాడిస్తోంది. శిరోభారం కూడా పెరిగినట్లు అనిపించింది. తల తడుముకున్నాను. క్షౌరశాల దగ్గరగా లేదు. అందులో ఆదివారం కావడంవల్ల రద్దీ తప్పదు. మెయిన్ రోడ్డుదాకా వెళ్ళి నెమ్మదిగా నడుస్తున్నాను. చిరుగుల నిక్కరు వేసుకున్న ఏడూ ఎనిమిదేళ్ళ కుర్రవెధవ అద్దాల తలుపులు శ్రద్ధగా తుడుస్తున్నాడు. ఆ తలుపుల మీద అందంగా 'హెయిర్ డ్రెస్సింగ్ సెలూన్, స్వాగతం' అని చెక్కి వున్న ప్రకటన చదువుకుంటూ నా నడక వేగాన్ని కాస్త తగ్గించాను. కానీ, అప్పటికే ఎక్కువ మంది వెయిటింగ్ లిస్టులో ఉన్నట్లు అనుమానం వేసింది. పోనీ యింకో ఆదివారం దాకా వాయిదా వేస్తేనేమీ అన్న ఆలోచన నాలో ఉదయించింది. నడక వేగం మళ్ళీ హెచ్చించబోతున్నాను. నా మనసులోని సంఘర్షణ ఎలా పసిగట్టేశాడో- యేమో! ఆ పసివెధవాయ్ గబాలున నా దారికి అడ్డం వస్తూ 'రెండు నిముషాల్లో అయిపోతుంది సార్' అని తెగ మొహమాట పెట్టేశాడు. నా చిన్నతనంలో ఆకతాయితనంతో ఈగల్ని చేత్తో పట్టుకుందుకు ప్రయత్నిస్తే, అవి దొరక్కుండా ఎగిరిపోయేవి. వాటికి వీపు మీద కళ్ళు వున్నాయని ఒక అభిప్రాయం అప్పట్లో నా చిన్నారి మెదడులో చోటు చేసుకుంది. సరిగ్గా ఈ సెలూన్ ద్వారాన్ని కాపలాకాస్తూ, తడిగుడ్డతో అద్దాల తలుపులు తుడుస్తున్న చిన్నారి వెధవని చూస్తే వీడికి వీపు మీద దివ్యచక్షువులు లేవుకదా అని ఆశ్చర్యం వేసింది. ఒక కంట అద్దాల తలుపులు శుభ్రంగా తుడుస్తూ మరో కంట రోడ్డుమీద పోయే వాళ్ళనీ, వాళ్ళ మనోభావాలనీ కనిపెడ్తున్నాడు. ఇంత చిన్న వయసులోనే లోకంతీరూ, వాణిజ్య ధోరణీ అవగాహన చేసుకుంటున్న బాల శ్రామికుణ్ణి నా మనసులో ప్రశంసించకుండా వుండలేక పోయాను. వాడి చొరవకూ, మాటకారి తనానికీ మంత్ర ముగ్ధుడిలాగ కట్టుబడి క్షౌరశాలలోకి అడుగు పెట్టాను. ఒక పొడుగుపాటి బెంచీమీద నిరీక్షిస్తూ ఆరుగురు కూర్చున్నారు. సన్నటి మూలుగులాంటి శబ్దం చేస్తూ సీలింగ్ ఫాన్ ఒకటి తిరుగుతోంది. దాని క్రింద రెండు పంచకల్యాణి గుర్రాల్లాంటి ఎత్తయిన కుర్చీలలో యిద్దరు వ్యక్తులు అప్పుడే తలలు అప్పగించి కూర్చున్నారు. నిరీక్షించే ఓపికా లేక, బయటకు పోగల తెగింపూ

లేక సంశయిస్తూ, ఆ బెంచీమీద ఏడోవాడిగా కాస్త చోటు చేసుకుని కూర్చున్నాను. సెల్ఫ్ షేవింగ్ లాగనే, ఎవరితల (జుత్తు) వారే కత్తిరించుకునే పద్ధతికి యింకా ఎందుకు ప్రాచుర్యమూ, గౌరవమూ కలగలేదు? అన్న మీమాంస నాలో మెదిలింది. నిజానికి ఒకరికి క్షౌరం చేసినంత సులభంగా, నేర్పుగా ఎవరికివారే చేసుకోవడం తేలికకాదు. నాలోని విసుగుదల నీడగా నా నొసటి మీద కనపడిందేమో, ఎంతో ఏకాగ్రతతో క్షౌరం చేస్తున్న క్షౌరకుడు ( ఆ సెలూన్ అధిపతి) చటుక్కున చేతిలోని పని ఆపి నా దగ్గరకు వచ్చి నా చేతిలో ప్రత్యేకంగా ఒక పత్రికను కుక్కి, మళ్ళా తన పనిలో మునిగిపోయాడు. అదేదో వార పత్రికో, పక్షపత్రికో. కాస్త బరువుగానే వుంది. సెలూన్ బయట కూర్చున్న చిన్నారి వెధవ అయితేనేమి, ఈ క్షౌరక శ్రేష్ఠుడయితేనేమి - యిద్దరూ యిద్దరే. మాంచి మనస్తత్త్వ శాస్త్రవేత్తల్లా వున్నారు చూడబోతే. కష్టమర్స్ మనసుల్లో భావాలూ, బలహీనతలూ వీళ్ళకందని రహస్యాలు కావు. నిజమే మరి. ఏ వృత్తిలోనైనా ఈ చొరవా, చాకచక్యం, లౌక్యం లేకపోతే ఈ రోజుల్లో అడుక్కుతినిపోతారు. వాళ్ళ క్లైయింట్స్‌ని యింకెవరో రంగు రంగుల వల వేసి తన్నుకుపోతారు.

చేతి గడియారం పెట్టుకురావడం మరచాను. గోడవైపు చూశాను. నా పిచ్చికానీ, క్షౌరశాలల్లో ఎక్కడైనా గోడ గడియారాలు పెట్టి కాలగతిని పదే పదే గుర్తు చేస్తూ వుంటారా? నగ్న సౌందర్యం వొలికిస్తున్న సుందరాంగుల రంగు రంగుల చిత్రాలున్న క్యాలండర్లూ, నిలువుటద్దాలూ వున్నాయి గోడలకి. అటు చూస్తూ ఒకంతట దృష్టి మళ్ళించడం సాధ్యం కాదు. సరే కాలక్షేపం కోసం చేతిలో వున్న పత్రిక మీదకు దృష్టి సారించాను. ఇదివరకు నేనా పత్రికను చూసినట్లు కానీ, పేరు విన్నట్లు కానీ గుర్తు లేదు. అయితేనేం, ముఖచిత్రమే ఒక సమ్మోహనాస్త్రం. ఒక రంగుల వల, తియ్యని కల ఒక ముగ్ధ స్విమ్మింగ్ దుస్తుల్లో మోకాళ్ళమీద కూర్చుని విలాసంగా నవ్వుతోంది. ఆమె ఒళ్ళంతా నాజుకుగా నవనవలాడుతూ కానవస్తున్నా, రెండు కళ్ళమీదుగా గులాబీ రెమ్మ ఒకటి కళాత్మకంగా అడ్డు వస్తోంది. పేజీ తిప్పి ఎవ్వరామె? అని విషయసూచిక చూశాను. ముఖచిత్ర సుందరి... అని ఒక క్వశ్చన్‌మార్క్ వేసివుంది. ఈ ముఖచిత్ర సుందరిని సరిగ్గా గుర్తించిన పాఠకుడికి ఆమె వర్ణ చిత్రం ఉచితంగా పంపబడుతుంది అని ప్రకటన సారాంశం. మొదటి పేజీతోనే పాఠకుడి మెదడును పదునుపెట్టే ప్రయత్నం. కాస్త ప్రాచుర్యం తగ్గుముఖం పట్టిన ఒక సినీతారకు ప్రోత్సాహం, పత్రికకు సర్క్యులేషన్, పాఠకుడి సినీ విజ్ఞానానికి చిత్రమైన సత్కారం- యిన్ని లక్ష్యాలు ఒకే దెబ్బతో సాధించబడుతున్నాయి. లోపలి కాగితాలు కాస్త నాసిరకంగా వున్నా, శీర్షికలూ, కథలకు పెట్టిన పేర్లూ షోకేస్‌లోని వస్తువుల్లాగ పాఠకుణ్ణి ఉవ్విళ్ళూరిస్తున్నాయి. టైటిల్స్ చదువుతేచాలు చివరి లైనుదాకా చదివించేస్తాయి. యతిప్రాసలూ,శ్లేష, వ్యంగ్య వైభవం నన్నే ఉక్కిరిబిక్కిరి చేసి మనసులో అడుగున పడివున్న బలహీనతల్ని గిల్లి గిలిగింతలు పెడుతూవుంటే యింక అప్పుడే యౌవ్వనంలో అడుగు పెట్టిన కుర్రకుంకల

సంగతి ఏమి చెప్పను? మచ్చుకి కొన్ని శీర్షికలు - కాలుజారిన కాదంబరి, చిరిగిపోయిన సినీ తార డైరీలో ఒక పేజీ, చీకటిలో సెంటువాసన, కుక్కిమంచం తీసిన కూనిరాగాలు, పడవలో పరువం. ఇవి కాక మాదక ద్రవ్యాలలో మజా - కాన్వెంటు కన్య కామినితో ఇంటర్వ్యూ. ఆ శీర్షికకు అనుగుణంగా సబ్బు బుడగల మీద తేలిపోతున్న నిమీలిత నేత్రి చిత్రం. రసవత్తరమైన ప్రణయ ఘట్టానికి చేరువగా తీసుకుపోతూ, స్పీడ్ బ్రేకర్‌లా సశేషం అన్న బోర్డు చూపించే సీరియల్స్, అవివాహితులకు హెచ్చరికలూ, కొత్త దంపతులకు చిట్కాలు-ఈ పేజీలు దాటుకుంటూ పోగల బాలబాలికలకు రెండు కాలమ్స్ ప్రత్యేకం. ఒక పుటలో యిరవై మంది యువతీ యువకుల చిన్న ఫొటోలు అచ్చయి వున్నాయి. అందరి ముఖాల్లో ఏదో విజయగర్వం. శీర్షిక చూశాను. తెలుగు సినిమాలో మొట్టమొదట బ్రేక్ డాన్స్ చేసిన సినీ జంట ఏది? అన్న గత సంచికలోని సవాలుకు సరియైనజవాబులు పంపిన ఉత్సాహవంతుల ఫొటోలవి.

ఇంతలో కత్తెరను వ్రేళ్ళతో కదిపి వింతగా చప్పుడు చేస్తూ నన్ను పిలిచి ఈ లోకంలోకి లాక్కువచ్చాడు క్షౌరకుడు.

త్వరగా నా వంతు వచ్చేసినందుకు ఎంతో ఆశ్చర్యపోయాను. పిలుస్తేనేకానీ ధ్యాస మళ్ళించుకో లేనంతగా పత్రికలో యిరుక్కు పోయినందుకు కాస్త సిగ్గుపడ్డాను కూడా. నా భావాల్ని అవలీలగా చదివేసినట్లు నవ్వుతూ "ఆ పత్రిక రెండు నెలలనుండీ కొత్తగా మార్కెట్‌లోకి వచ్చి గాలి దుమారం లేపినట్లు చేసేసింది సార్. దానికున్న గిరాకీ మరి దేనికీ లేదంటే నమ్మండి" అంటూ మాసి గబ్బు కొడుతున్న గుడ్డలలో కాస్త మేలైనది నా చుట్టూ కప్పి నన్ను కుర్చీలోకి కూలదోశాడు.

ఆ తరువాత ఒక శనివారం మధ్యాహ్నం వేళ కాలినడకను పోతున్నాను. ఏదో కారు అసహనంగా నన్ను ప్రక్కకు తప్పుకోమని రొదచేస్తూ ఉంటే కాస్త ఎడమ వైపుకి జరిగి పోతున్నాను. నా ముఖంలోకి నిశితంగా చూస్తూ "నువ్వటోయ్ శేఖరం... ఎన్నాళ్ళ కెన్నాళ్ళకీ" -అంటూ తన మారుతీ కారు ఆపి లోనికి ఆహ్వానించాడు ఆ రథసారథి సుందర రామారావ్. గతంలో అతను నా క్లాస్‌మేట్. కొన్నాళ్ళు మా ఇంటి పొరుగున మేడలో ఉంటూఉండేవాడు. ఏ రాత్రీ సాహిత్య గోష్ఠి లేనిదే మేం నిద్రపోయేవాళ్ళం కాదు.

సర్వజనీనమైన విలువలూ, సాహిత్య ప్రయోజనాలూ వంటి వ్యాసాలు వ్రాసి కాలేజీ వార్షికోత్సవాల్లో బహుమతులు సంపాదించుకున్నాడు. చాలా రోజులూ ఏళ్ళూ గతించాక ఇలా కలవడం నాకు ఎంతో సంతోషం కల్గించింది. అతని కళ్ళల్లో కూడా ఏదో ఉత్సాహం, కాంతీ కనిపిస్తున్నాయి. వాగ్ధార అప్పటికంటే స్థిరంగా పెరిగింది. "ఈ మధ్యనే నేనొక కొత్త పక్ష పత్రికను నడిపే బాధ్యత నెత్తిమీద వేసుకున్నాను. ఇదివరకు పత్రికలకున్న సర్క్యులేషన్ రికార్డును బ్రేక్ చేస్తానని మా బాస్‌కి గట్టిగా మాట ఇచ్చాను" అంటూ అతను ప్రవేశపెట్టబోతున్న కొత్త ప్రణాళికలూ, ఆకర్షణలూ వివరిస్తున్నాడు. అతని ఉత్సాహం చూస్తూఉంటే నేనీ

మధ్యనే చదివిన ఒక నవలలో ఇర్వింగ్ వాలేస్ చిత్రీకరించిన పాత్రికేయుడు పాత్ర గుర్తుకు వచ్చింది. ఇంతలో ఏదో గేటు దగ్గర కారు ఆపాడు రామారావ్. అదేదో కాన్వెంటో - స్కూలో. అందులో ఉన్నది ఒక్కటే కాస్త పెద్ద బిల్డింగ్. దాని చుట్టూరా చిన్న చిన్న సిమ్మెంటు రేకులు కప్పిన షెడ్లు ఎన్నో ఉన్నాయి. ఒక నీడనిచ్చే చెట్టయినా లేదు. ఆటస్థలం అన్నది అసలే లేదు. అప్పుడే స్కూలు వదిలిపెట్టినట్లున్నారు. బిలబిలమని పిల్లలు బయటపడి కాంపౌండ్ గోడ చుట్టూ ఉన్న దుకాణాల మీదా, అమ్మకాల బండ్ల మీదా దాడి చేస్తున్నారు. ఒక ముసలిది రంగు రంగుల మిఠాయిలూ, బిళ్ళలూ అమ్ముతూ పాత గుడ్డతో ఈగల్ని తోలుతోంది. రామారావు పిల్లలందర్నీ కలియజూస్తూ ఆ ముసలిదాని ముందు నిలబడ్డ ఎనిమిదేళ్ళ పిల్లవాణ్ణి గొంతెత్తి పిల్చాడు.

"మమ్మీ నీకు ఇంట్లో అన్నీ చేసిపెడుతుంది. నువ్వేమో ఇక్కడ మట్టి కొట్టుకు పోయిన అడ్డమైన గడ్డీ కొనుక్కుతింటున్నావా?" అని ప్రేమగా వాడిని మందలిస్తూ నా వేపు బాధగా చూసి వాపోయేడు.

"ఈగలు వాలి, మట్టికొట్టుకు పోయిన తినుబండారాలు అమ్ముతూ పసివాళ్ళ ఆరోగ్యాలు శాశ్వతంగా తగలేస్తూ ఉంటే అటుస్కూలు మేనేజిమెంటుకూ పట్టదు, ఇటు పబ్లిక్ హెల్త్ వాళ్ళకూ చీమకుట్టినట్టు లేదు చూశావా శేఖరం" అని విసుక్కున్నాడు.

పాపం ఈ ముసలిదానికి రామారావు భాషా, బాధా అర్థం కాలేదు. ఒక కష్టమర్‌ని ఆమె దగ్గరనుంచి క్రూరంగా లాక్కుపోతున్నందుకు విచారంగా చూసింది.

ఆ రాత్రి ఏదో గజిబిజి ఆలోచనల వలయంలో తిరుగుతూ మేను వాల్చాను. నాకళ్ళ ముందొక వెల్లువ. అది నురగలు కక్కుతూ, సుడులు తిరుగుతూ, ఉరకలేస్తూ పారుతోంది. పెద్ద పెద్ద చెట్లూ, దుంగలూ, కాన్వెంట్లూ, కార్పొరేషన్లూ కొట్టుకు పోతున్నాయి. గట్టు మీద పట్టు దొరికి నిలబడ్డం కష్టంగా ఉంది. ప్రవాహ వేగం గట్లను కొరుకుతూ, కోరుతూ నీటిలో కరిగించి వేస్తోంది. సిల్కు లాల్చీలో స్థూలకాయుడొకడు దబ్బున నీటిలో పడ్డాడు. అతని లాల్చీ అంచులుపట్టుకున్న రామారావు కూడా ప్రవాహంలోకి రాలిపోయాడు. హెయిర్‌డ్రెస్సరూ, వాడిని నమ్ముకున్న పసికుర్రవాడూ, మిఠాయిలమ్మే ముసల్దీ, నేనూ కాస్తంత ముందు వెనకలుగా జారిపడి మునుగుతూ, తేలుతూ, నీళ్ళు మింగుతూ ముందుకు సాగిపోతున్నాం.

"మహాగజాః పలాయంతే మశకా నాంతు కాగతిః" అని ఏదో నాలో నేనే గొణుక్కుంటున్నాను.

"లోకమంతటికీ తెల్లవారినా మీకింకా నిద్ర చాలినట్టు లేదే" అంటూ నన్ను కుదిపి నా శ్రీమతి ఒడ్డుకు చేర్చింది.

(ఆంధ్రపత్రిక వీక్లీ, 23-6-1989)